క్లుప్తంగా

గురుకులంలో కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కెమిస్ట్రీ ల్యాబ్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) బుధవారం ప్రారంభించారు. ప్రధానమంత్రి స్కూల్స్ రైజింగ్ ఆఫ్ ఇండియా(పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ) నిధులు రూ.24 లక్షలతో గురుకుల పాఠశాలకు చెందిన క్రీడామైదానం అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో గురుకుల పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, వసతి సౌకర్యాలు కల్పించడంలో ఎటువంటి రాజీ లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొండపల్లి లక్ష్మీ సుజాత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరువాక వేడుకలు



నందిగామ రూరల్: మండలంలోని మునగచర్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం బసవన్నలకు పూజలు చేసి ఏరువాక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రతి ఇల్లు పాడి పంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. అదే విధంగా చందర్లపాడు గ్రామంలో ఏరువాక వేడుకలను ప్రారంభించి వ్యవసాయ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వీరంకి వీరాస్వామి, పంగలూరి నరసింహారావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు




వీరులపాడు: అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ పంట సాగు పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లోని రైతులు సాగుకు సిద్ధం చేసిన పంట పొలాల్లో బుధవారం వ్యవసాయ కూలీలతో పత్తి విత్తనాలు విత్తారు. మండలంలో తొమ్మిది వేల ఎకరాలలో పత్తి, రెండు వేల ఎకరాలలో పెసర, వెయ్యి ఎకరాలలో మినుము, 4,200 ఎకరాలలో వరి పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి తెలిపారు.

ఆలయ అధికారులకు సన్మానం



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి ఆలయం నుంచి బదిలీపై వెళ్తున్న అధికారులతోపాటు బదిలీపై ఇక్కడకు వచ్చిన అధికారులను ఆలయ ఈవో కిషోర్‌కుమార్, ఈఈ ఎల్.రమ బుధవారం ఘనంగా సత్కరించారు. బదిలీపై వెళ్తున్న ఏఈఓ తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ ప్రకాశరావులతోపాటు బదిలీపై ఇక్కడికి వచ్చిన డీఎస్ రాజులను దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలు ప్రారంభం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం నిర్వహించారు. హోమం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీడని వరద ముంపు భయం

- రెండేళ్లుగా మునేరుకు భారీ వరదలు
- పెనుగంచిప్రోలులో తీవ్రనష్టం
- విలువైన భూములతోపాటు సర్వం కోల్పోతున్న స్థానికులు
- ఈఏడాది పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన
- మునేరుకు రిటైనింగ్ వాల్ కట్టాలని ప్రజల డిమాండ్



గతేడాది భారీ వర్షాలకు పెనుగంచిప్రోలులో మునేరుకు వచ్చిన వరద(ఫైల్)

పెనుగంచిప్రోలు: వర్షాకాలం వస్తోందంటే చాలు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మునేరు పరీవాహక ప్రాంత వాసులు హడలెత్తిపోతున్నారు. రెండేళ్లుగా మునేరుకు కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన వరదలు పెనుగంచిప్రోలులోని మునేరు పక్కన లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి కంటి మీద కునుకు లేకుండా చేశాయి. అదేవిధంగా వరదల ధాటికి మునేరుకు అవతల ఉన్న మామిడితోటలు వరదలకు మునేరులో కలిసిపోయాయి. దీంతో నివాసితులతోపాటు రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత రెండేళ్లుగా వరుసగా సంభవించిన వరదలకు పెనుగంచిప్రోలులోని పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి మునేరు పక్కన శ్రీతిరుపతమ్మవారి ఆలయం వరకు నివశిస్తున్న వారి గృహాలను వరద ముంచెత్తింది. దీంతో వారు కట్టుబట్టలతో బయటకు వచ్చి రెండు రోజులపాటు పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంట్లో పరికరాలు, వస్తువులు తడిసిపోవటంతోపాటు బాధితులు తీవ్రంగా నష్ట పోయారు.

రిటైనింగ్ వాల్ నిర్మించాలని డిమాండ్..

ఈ ఏడాది కూడా వర్షాలు ఎక్కువగా ఉంటాయని వాతావారణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో మునేరుకు వరదలు తప్పేలా లేవని పెనుగంచిప్రోలువాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరదల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం మునేరుకు ఇరువైపులా సుమారు కిలోమీటరు మేర రిటైనిగ్ వాల్ నిర్మించి తమను ఆదుకోవాలని రైతులతోపాటు నివాసితులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే మునేరు కాజ్‌వే వద్ద నుంచి శ్రీతిరుపతమ్మవారి ఆలయం వరకు కరకట్ట నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయి. మునేరుకు 2023, 2024లో వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం సమీపంలో రెండువైపులా 17కిలోమీటర్ల మేర రిటైనింగ్‌వాల్ నిర్మిస్తున్నందున, ఏపీ ప్రభుత్వం కూడా మునేరు వరద ముప్పు నుంచి రక్షణ కల్పించేందుకు మునేరుకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని వరద బాధితులు కోరుతున్నారు. ఆదిశగా జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధి, అధికారులు దృష్టి సారించాలని బాధితులు కోరుతున్నారు.



ఇళ్లల్లోకి చొరబడిన వరద నీరు(ఫైల్)



కోతకు గురికాకుండా ఏర్పాటు చేసుకున్న బండరాళ్లు

రైతులకు తీరని నష్టం..



ఏరును తలపిస్తున్న మామిడి తోటలు (ఫైల్)

వరదలకు మునేరు పక్కన మామిడి తోటలతోపాటు పలు ఫంక్షన్‌హాళ్లు కూడా దెబ్బతిన్నాయి. వందలాది మామిడి చెట్లు వరదకు కొట్టుకు పోయాయి. ఫంక్షన్‌హాళ్లలోని కుర్చీలు, సోఫాలు, సిలిండర్లు, డెకరేషన్ సామగ్రి అంతా నీటిపాలైంది. దీంతో మామిడి తోటల రైతులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులకు తీవ్రనష్టం వాటిల్లింది. వరద ధాటికి పొలాలు కోతకు గురయ్యాయి. ఈఏడాది కూడా వరదలు వస్తే మామిడి తోటలు నామరూపాలు లేకుండా పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలువురు రైతులు రూ..లక్షలు వెచ్చించి పొలాల చుట్టూ బండరాళ్లను రక్షణగా ఏర్పాటు చేసుకోగా, మిగిలిన రైతులు అంత ఖర్చు భరించలేక మిన్నకుండిపోయారు.

నేడు భూముల కౌలు వేలం

నందిగామరూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి ఆలయానికి చెందిన వ్యవసాయ భూములకు గురువారం కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నరసింహమూర్తి, అనువంశిక ధర్మకర్త వెంకట లక్ష్మీసాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ అమ్మవారికి ఆలయానికి చెందిన 29 ఎకరాలకు గురువారం ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఆసక్తిగల రైతులు కౌలువేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు కౌలు వేలం

భీమవరం(వత్సవాయి): జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామంలో వేంచేసియున్న శ్రీయోగానందాలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి చెందిన వ్యవసాయభూములకు ఈ నెల13వతేదీన కౌలువేలం నిర్వహించనున్నట్లు ఈవో కానూరి సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 19.32 ఎకరాల మెరకభూమి కౌలువేలాన్ని భీమవరంలోని శ్రీ రాజగోపాలస్వామి వారి ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాటలో పాల్గొనేవారు ముందుగానే రూ.లక్షను డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దేవాదాయశాఖకు బకాయిలు ఉన్నవారు వేలంలో పాల్గొనేందుకు అనర్హులని స్పష్టం చేశారు. ఆసక్తిగల వారు కౌలువేలంలో పాల్గొనాలని ఈవో కోరారు.

పంట దిగుబడులు పెంచాలి

తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): రైతులు ఈ ఏడాది పంట దిగుబడులు పెంచాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సూచించారు. గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో ప్రభుత్వం అందిస్తోందన్నారు. పంట దిగుబడులు పెంచాలన్నారు. గ్రామంలో రైతులు వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమ ద్వారా కూడా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించి ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీడీవో నితిన్, ఏడీఏ భవానీ, ఏపీవో రామకృష్ణ, ఏవో వరలక్ష్మి, నాయకులు సత్యనారాయణప్రసాద్, రాజేశ్వరరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



కల్యాణ క్రతువులు నిర్వహిస్తున్న అర్చకుడు



హోమాది కార్యక్రమాలను నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న దంపతులు

నందిగామరూరల్: మండలంలోని పల్లగిరిగట్టుపై త్రిశక్తిపీఠంలో వేంచేసియున్న కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పదో వార్షిక మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాజేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పూజలు, కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పలు రకాల పుష్పాలు, విద్యుద్దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో దుర్గామల్లేశ్వర స్వామివారి శాంతి కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు కొప్పు హనుమంతరావు, గంగుల దుర్గాప్రసాద్, వెంకన్న పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



పేరకలపాడులో తాగునీరు రావడం లేదంటూ ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేస్తున్న మహిళలు

పేరకలపాడు(కంచికచర్ల): వారం రోజుల నుంచి సక్రమంగా తాగునీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ కంచికచర్ల మండలంలోని పేరకలపాడు గ్రామ మహిళలు బుధవారం రోడ్డెక్కి ఆందోళన చేశారు. ఖాళీబిందెలతో రోడ్డుపై నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా గ్రామమహిళలు మాట్లాడుతూ వారం రోజుల నుంచి రెండు ఎస్సీకాలనీలకు తాగునీరు సక్రమంగా సరఫరాగాకపోవడంతో అవస్థలుపడుతున్నామన్నారు. తాగునీరు రాకపోతుండటంతో కిలోమీటరు దూరంలోని నేషనల్ హైవే దగ్గర ఉన్న పేరకలపాడు క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నామని వాపోయారు. దీంతో కూలిపనులకు వెళ్లలేక ఇబ్బందిపడుతున్నామన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్ష్యుడు వేమవరపు పురుషోత్తం మాట్లాడుతూ ఇటీవల ఎస్సీకాలనీలో ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందితే ఆ మృతదేహానికి స్నానం చేపించేందుకు కూడా నీరు లేకపోవడంతో కాలనీకి సమీపంలోని ఓ పాడుబడిన బావికి విద్యుత్ మోటార్ ఏర్పాటు చేసి నీటిని తోడాల్సి వచ్చిందని తెలిపారు. గ్రామానికి వచ్చే ప్రధాన పైపులకు లీకులు ఏర్పడటంతో తాగునీరంతా వృధాగా పోతోందని, గ్రామ పంచాయతీ పాలకులు, అధికారులు కాని పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి పేరకలపాడు ఎస్సీకాలనీలకు సజావుగా తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

ఎంపీడీవో కార్యాలయ ఏవోగా సబిత

నందిగామరూరల్: మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏవో)గా సబిత బుధవారం బాధ్యతలు చేపట్టారు. గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయం నుంచి బదిలీపై ఆమె నందిగామకు వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా ఏవో సబిత మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేయనున్నట్లు చెప్పారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు

నందిగామరూరల్: కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తెలిపారు. మండలంలోని తొర్రగుడిపాడులో ఉపాధీ హామీ పథకం కింద నిర్మించిన సీసీ రోడ్డు, రామిరెడ్డిపల్లిలో నిర్మించిన గోకులం షెడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకూరు హైమారావు, నాయకులు మన్నే కళావతి, తోట నాగమల్లేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మునగచర్లలో..

గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి పాలన సాగుతోందని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని మునగచర్లలో నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీచర్లు సమయపాలన పాటించాలి

పెనుగంచిప్రోలు: ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో డి.రవీంద్ర బుధవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. మండలంలోని 33 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని కోరారు. ఇందుకోసం గ్రామస్తులు, ఎస్ఎంసీ సభ్యులు సహకారం తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పానకం కావిళ్లతో గ్రామోత్సవం



ఆలయం నుంచి బయలుదేరిన పానకం కావిళ్లు

పెనుగంచిప్రోలు:ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం తరుపున బుధవారం పానకం కావిళ్ల గ్రామోత్సవం నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటూ ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఆలయం వద్ద నుంచి గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈకార్యక్రమం నిర్వహించి నాలుగోరోజు ముత్యాలమ్మవారికి పొంగళ్లు చేయడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషోర్‌కుమార్, ఈఈ రమ. పాలక వర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, అమ్మవారి క్రతువులు నిర్వహించే వివిధ కులాల వారు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా



పెనుగంచిప్రోలులోని ఓ వెంచర్‌లో డంప్ చేసిన ఇసుక

పెనుగంచిప్రోలు: మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అధికార పార్టీ నాయకులు పెనుగంచిప్రోలు వద్దనున్న మునేరు నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా గ్రామం చివర ఉన్న వెంచర్లలో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి అర్ధరాత్రి దాటిన తరువాత లారీల్లో యథేచ్ఛగా తెలంగాణకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు రీచ్‌ల నుంచి శివాపురం, జొన్నలగడ్డ మీదుగా తెలంగాణకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా అక్రమంగా సాగుతోంది. శివాపురంలో కూడా ఖాళీ స్థలాల్లో ఇసుక డంప్ చేస్తున్నారు. చెక్‌పోస్టులు ఉన్నా ఇసుక దందా సాగుతోందని, అధికారుల ఉదాసీన వైఖరి కారణంగానే ఇసుక యథేచ్ఛగా తరలిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి నాయకులకు ఉచిత ఇసుక పథకం కాసులు కురిపిస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటో బోల్తా–ఆరుగురికి గాయాలు




రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడు

కంచికచర్ల: ఆటో పల్టీ కొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, మరో నలుగురికి స్వల్పగాయాలైన సంఘటన కంచికచర్లలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు కథనం మేరకు వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన 14మంది కార్మికులు ఇబ్రహీంపట్నం మూలపాడులో సిమెంట్ రోడ్డు పనులకు హాజరై తిరిగి స్వగ్రామం వస్తుండగా, కంచికచర్ల–పరిటాల మధ్యలో నక్కలంపేట రోడ్డు సమీపంలోకి రాగానే ఆటో హ్యాండిల్ లాక్ అయింది. దీంతో ఆటో ఒక్కసారిగా రోడ్డుపై పల్టీకొట్టింది. ఈ ఘటనలో జుజ్జూరు గ్రామానికి చెందిన రాంబాబు, నాగరాణిలకు తీవ్రగాయాలు కాగా మిగిలిన నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను ప్రైవేట్ అంబులెన్స్ ద్వారా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్పగాయాలైన నలుగురిని వైద్య చికిత్స కోసం టోల్‌ప్లాజా అంబులెన్స్ వాహనంలో నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మూడు పొక్లెయిన్లు సీజ్

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం కొత్తూరు చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్న మూడు ప్రొక్లెయిన్లను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు మైనింగ్, రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేశారు. స్థానిక అధికార పార్టీ నాయకులు ఆరు రోజులుగా రేయింబవళ్లు మూడు పొక్లెయిన్లతో చెరువు మట్టిని తవ్వి అక్రమంగా విక్రయించారు. చెరువు మట్టిని బుడమేరు కాల్వ గండ్లు పూడ్చడానికి అనుమతులు కోరిన అధికార పార్టీ నాయకులు నామమాత్రంగా గండ్ల వద్దకు తోలి, అధిక మొత్తంలో మట్టిని అమ్ముకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు ఇంతవరకు రాకపోవడం గమనార్హం.

మున్సిపల్ ఫ్లోర్‌లీడర్‌గా యాకుబ్‌అలీ



షేక్ యాకుబ్‌అలీ

నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గ పట్టణంలోని ఆరోవార్డు కౌన్సిల్ సభ్యుడు షేక్ యాకుబ్‌అలీని నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేసేవారికి పార్టీలో సముచిత స్థానం దక్కుతుందన్నారు. వార్డు కౌన్సిలర్‌గా యాకుబ్‌అలీ అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. పురపాలక సంఘంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని యాకుబ్‌అలీకి సూచించారు. యాకుబ్ అలీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఫ్లోర్‌లీడర్‌గా నియమించిన జగన్‌మోహనరావు, అరుణకుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. యాకుబ్‌అలీకి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

కౌలు వేలం ద్వారా రూ.3.36 లక్షల ఆదాయం



కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

నందిగామరూరల్: నందిగామ డివిజన్‌లోని పలు ఆలయాలకు చెందిన వ్యవసాయ భూముల కౌలు వేలం ద్వారా రూ. 3.36 లక్షల ఆదాయం వచ్చిందని గ్రూప్ టెంపుల్స్ ఈవో గంగాధర్ తెలిపారు. మండలంలోని అంబారుపేట, ఐతవరంతోపాటు కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామంలోని ఆయా ఆలయాల భూములకు బుధవారం కౌలు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబారుపేటలో వేంచేసియున్న ఓంకారేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి వారి ఆలయాలకు చెందిన 5.56ఎకరాలకు రూ. 1.21లక్షల ఆదాయం వచ్చిందన్నారు. అదే విధంగా ఐతవరంలోని ఆంజనేయ స్వామివారి ఆలయానికి చెందిన 5.50 ఎకరాలకు రూ. 1.30 లక్షలు, కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామంలోని ఆంజనేయ స్వామి వారి ఆలయానికి చెందిన 6.94 ఎకరాలకు రూ.85వేల ఆదాయం వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో అంబారుపేట సత్యమ్మ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ గరికపాటి భాస్కరం, దేవదాయ శాఖాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకారం

నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామి వారి ఆలయ అధికారిగా కంచర్ల సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని బ్రహ్మచారి బావాజీ మఠం ఈవోగా ఉన్న ఆయన రామలింగేశ్వరస్వామి ఆలయానికి అదనపు ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

విజయవాడ డివిజన్ పనితీరుపై ఏజీఎం సమీక్ష

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్ పనితీరుపై దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం నీరజ్ అగర్వాల్ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, ఇతర అధికారులతో కలిసి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఆర్ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో డివిజన్‌లో అవలంబిస్తున్న రైళ్ల సమయపాలన, భద్రత, ప్రయాణికుల మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డివిజన్ పనితీరుపై వివరణాత్మకంగా వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో కంటే భద్రత, సమయపాలన, మౌలిక సదుపాయాల అమలులో డివిజన్ సాధించిన పనితీరును ఏజీఎం సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా ఇదే పనితీరు కొనసాగించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో డివిజన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రయాణికుల సౌకర్యాలను సంతృప్తికర స్థాయిలో మెరుగుపర్చాలని చెప్పారు. అదే విధంగా రైల్ మదద్ ద్వార అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. భద్రత కార్యాచరణపై ఎక్కువ దృష్టి సారించాలని, క్రమం తప్పకుండా భద్రత నిబంధనలను కఠినంగా పాటిస్తూ అన్ని సెక్షన్లలో క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఏడీఆర్ ఎడ్విన్, పలు బ్రాంచ్‌ల అధికారులు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]